# ఒక జీవుడి వేదన

అప్పుడప్పుడు నన్ను ఏదో అశాంతి ఆవరిస్తుంది. మనోవ్యథ ఒక యమ యాతన. దానికి ఒక రూపం.వుండి చావదు. స్పష్టమైన కారణాలు దొరికి చావవు. అవి జన్మాంతరంతో సంబంధం వుండేవా? ఆనువంశికమైనవా? నన్ను విడిచిపోయిన నా బాల్యంలోని స్నేహాలతో, ఆటపాటలతో, అనుభవాలతో, అనుభూతులతో ముడివేసుకున్నవా? కౌమారంలోని కష్టనిష్ఠురాల మూలంగా తెరలు తెరలుగా వచ్చేవా? యౌవన సహజమైన అలజడి నుంచీ, ఆందోళన నుంచీ, ఉద్వేగాల నుంచీ మసక మసకగా చుట్టుకునేవా? నేను చదివే పుస్తకాలు తెచ్చి పెడుతున్నవా? ఈ మహానగరంలోని నా ఏడో అంతస్థులోని చిన్న ఉద్యోగం రేకెత్తిస్తున్నవా? నాకు కావలసిందేమిటి? ఈ తెగులు, ఈ బాధ ఏమిటి? మనుషుల మధ్యనే బతుకుతున్నా, వాళ్ళందరిలోనూ ఇమడలేని, వాళ్ళందరికీ చెందని ఒంటరితనం నాకే ఎందుకు? నాకు తెలియని ఏ తాత్త్విక పునాదుల పూల జాఫలం ఈ అశాంతి?

బాల్యం నన్ను విడిచిపోలేదు. మా ఊరితో కౌమారంలోనే బంధం తెగిపోయిన నా బాల్యం నన్నింకా పరవశున్ని చేస్తూనే వుంటుంది. నేను పుట్టి, పదేళ్ళు పెరిగిన మా ఊరి జ్ఞాపకాలు - ఆ పుణ్యం, ఆ పాపం - నన్ను ఆ లోకంలోకి జారుకునేట్లు చేస్తూనే వుంటాయి. సన్యాసి కుంటలో నేస్తగాళ్ళతో ఎండ్రకాయలు పట్టుకొని, కాల్చుకొని తినడం, ఉత్తబిత్తల బావుల్లో ఈతలు కొట్టికొట్టి, ఎండలో పరుగులు తీయడం, ఆడపిల్లల వెంటవెళ్ళి ఊరి బయట రేణివనంలో రేణిగాయలు ఏరుకోవడం, తొడలు కన్పించేదాకా, పావడాల్ని ఒడులుగా చేసుకోడానికి వాటిని బొడ్డుల్లో దోపుకున్నప్పుడు బూతు సావాసగాళ్ళ కిసకిసలు వినడం, ఏ పేదపిల్ల వెంటో వాళ్ళు పడితే నేనూ దూడలాగా వాళ్ళను అనుసరించడం, ఊరి దగ్గరి కొండ గుట్టల్లో పెరిగిన కంప పొదలు వెతికి వెతికి కలేకాయల్నీ, బలస పండ్లనూ,

బిక్కిపండ్లనూ పీక్కొని తినడం, చేలల్లో కోడి బుడమకాయల్ని కొరికి చేద్దైతే విసిరి, మంచి వాటిని కసకసా నమిలి తినటం, కాంచరకాయులు కోసుకొని రావడం. . .కూర కోసం అమ్మ వెంట ఎలక జివ్వి ఆకు, చెంచలాకు, పాయలాకు, చేలగట్ల వెంట వెంపర్లాడడం, ఎన్నో, ఎన్నెన్నో ఇప్పుడు మనసును గిలిగింతలు పెట్టే జ్ఞాపకాలు. . .
సావాసగాళ్ళ మధ్య చిన్న చిన్న కొట్లాటలు
గోలిగుండ్లాటలో
పుట్టచెండు ఆటలో
బలిగుడులో
రాత్రిపూట కల్లం కావలి వున్నప్పుడు
ఎన్నెన్ని బాల్యస్మృతులో?
గుండె మీద గాఢముద్రను వేసినవే అన్నీ. . . .
ఇప్పుడు మా ఊరు ఎట్లా వుందో నాకు తెలియదు. మా నాయన నా పదేళ్ళ వయసులోనే పోయాడు. చదువుకుంటే తప్ప కొడుకు బతకలేడని ఒక్కగానొక్క కొడుకైన నన్ను తీసుకొని మా అమ్మ, టౌను పక్క- పల్లెటూళ్ళోని మా పెద్దమ్మ ఇంటికి చేరింది. దాయాదులతో శతపోరి ఇంటిలో మా భాగాన్నీ, అయిదెకరాల చేనూ అమ్మి మా పెద్దమ్మ గూటికి చేరింది.

చదువుతో లంకె వున్న ఆ కౌమారం. . .

పెద్దమ్మ ఇంట్లో జీవితం

ఇంటి పనీ, చదువు, సంసారానికి అంటీ అంటనట్లుండే పెద్దనాన్న వేదాంతం. . .

పొద్దున్నేలేచి, బావినీళ్ళు చేదుకొని బిందెలు బిందెలు తేవటం ఇంత కారియర్లో సంగటో, సారకో, అన్నం మెతుకులో పెట్టించుకొని నాలుగు మైళ్ళు నడిచి స్కూలుకు వెళ్ళడం.

సాయంత్రం తిరిగి ఇల్లు చేరుకోవడం, కిరసనాయిలు బుడ్డి వెలుగులో ఆ తర్వాత ఎప్పుడో లాంతరు, మరెప్పుడో గుడ్డి కరెంటు వెలుగులో చదువు.

ఆదివారాల్లో, సెలవుల్లో పని. . . .చదువు. . .కాలేజీకి నడిచే. బి.ఏ. పూర్తి అయిందాకా అంతే . . .ఈ లోగా మా అమ్మ చనిపోయింది- నలభై ఏళ్ళ వయసులో నాటుమందులకు లొంగని ఉబ్బసం వ్యాధితో.

యవ్వనం వచ్చిందో లేదో ఉద్యోగం వేట. . .

మోహ మరీచికలు, ప్రేమ చెలిమలు. . .పెద్దమ్మ, పెద్దనాన్న వాళ్ళ గంపెడు సంసారాన్ని వదలి, మా దాసుగాడి చలవవల్ల హైదరాబాదు నగరంలో పడి, నగరం నడిబొడ్డున ఏడో అంతస్తులో ఒక్క చిన్న ప్రభుత్వ ఉద్యోగంలో. . .

స్కూల్లో చదివిన అయిదేళ్ళలో దగ్గరైన ఒకే ఒక్కడు దాసు. బొమ్మలు బాగా వేసేవాడు. పదోక్లాసు అవుతూనే హైదరాబాదు పారిపోయి నా బి.ఏ. పూర్తి అయిన రోజుల్లో మళ్ళీ కలిశాడు. వాడి ప్రోత్సాహమే, వాడి సహాయమే హైదరాబాదు చేర్చింది. వాడికి కుదురు వుంటే ఈపాటికి మంచి పేరు వచ్చి వుండేది. వాడి ప్రతిభ అంతా వాణిజ్య ప్రకటనల్లోనే ఇంకిపోతోంది. వాడే నా పెళ్ళికి పెద్ద.

హైదరాబాదు చేరాక అడపా దడపా ఒక కవిత రాయడం, ఒకటో అరో విమర్శ వ్యాసాలు ప్రచురించడం, సాహిత్య సమావేశాలకు ఏ మాత్రం వీలున్నా వెళ్ళడం, చివరి

వరుసలో కూర్చొని విని బయటపడడం, తిక్క లేచినప్పుడు నా గోడునూ, వాగుడునూ దాసుకు విన్పించడం, వాడి ప్రపంచాన్ని గురించి వినడం, నగరంలో నాలుగేళ్ళు గడిచిపోయాయి. ఒక సాహిత్య కార్యక్రమంలో నా కవిత్వం అచ్చేసిన జర్నలిస్టు మిత్రుడు పరిచయం చేసిన భూదేవితో స్నేహం, ఆ తర్వాత మిత్రులు చేసిన పెళ్ళి రెండేళ్ళు కావస్తోంది. మా ఇద్దరి సంపాదన, మెరుగైన తిండీ, భూదేవి చేసే చర్చలూ అశాంతిని కొంత పోగొట్టాయి. ఈ మార్పు కొంత సాయపడింది.

మరీ మనస్సు ముడుచుకొని పోయినప్పుడు ఆలోచనలతో, అశాంతితో మనస్సు బరువెక్కినపుడు మా భూదేవితో చెప్పుకుంటాను. ఆమె ఎప్పుడూ ఏదో ఒక పని చేసుకుంటూనే వుంటుంది. ఆ పని ధ్యాసలో వున్నప్పుడే " చెప్పరాదా? నాకే ఎందుకు ఈ పీడ" అంటాను.

"మన వేదాంతులు ఆత్మాన్వేషణ అంటారు కదా? ఇంకా కొన్నాళ్ళు మథనపడు నీకే తెలుస్తుంది" అంటుంది నవ్వుతూ. అది ఆపేక్ష నిండిన నవ్వు. పసిపిల్లవాడి ఆటల్లో తడబాట్లు చూసి తల్లి నవ్వే నవ్వులాంటి నవ్వు. కొంత కోపం వచ్చినా అణుచుకుంటాను. ఆమె మరీ మట్టిమనిషి. పత్రికలో పనిచేసేవాళ్ళంతా అంతే. ఈమధ్య ఆమెతో నా దిగులు మొరపెట్టుకోవడం కుదరలేదు. ఒక వారంరోజులుగా భూదేవి వాళ్ళ ఊరికి వెళ్ళింది ఏవో ఇంటి గొడవలంటూ. వాటితో నాకు సంబంధంలేదు. నేను భూదేవి మనిషినేగానీ, వాళ్ళ మనిషిని కాదు. పైగా భూదేవి నన్ను తోడు రమ్మనలేదు.

మొన్న సాయంత్రం దాసు ఆఫీసుకు ఫోను చేశాడు. వాడు వేసే వాణిజ్య ప్రకటనల్లాగే వాడూ - రంగురంగుల మాటల చిత్రాలతో. . .

"ఈ రోజు సాయంత్రం మనం దయానిధిని కలుస్తున్నాం. దయానిధి రా! ఆ మధ్య నువ్వొక వ్యాసంలో చర్చించిన నవల రాసిన దయానిధి. డిన్నరుకు ఆహ్వానం. దయానిధి డిన్నరంటే పదహారో లూయీ ఆహ్వానం వంటిది. వైట్‌హవుస్ ఆహ్వానం అనుకో. పోనీ కార్పొరేట్ ఆహ్వానం అనుకో. మంచి ప్రభుత్వ ఉద్యోగాలూ అవీ చక్కగా చేసుకుంటూ అవార్డులు తిరస్కరించే రచయితల్లాగా ఈ పిలుపును తిరస్కరించేవు? నీ తిక్కలు నాకు తెలుసు. మాట యిచ్చి చచ్చా. ఆయనే స్వయంగా నన్ను వెంటబె[illegible] ఆఫీసుకు వస్తున్నాడు - కార్లో - నిన్ను నేరుగా ఇంటికి తీసుకవెళ్ళడానికి. నీ కోసం. . .[illegible] కారణంగా ఈ పిలుపు. . .'నాకు సైతం మదిరవాగులు పొంగి పొరలేను. . .' మన అదృష్టం . . .భూదేవి ఊళ్లో లేదు. . ."

వాడి నగరం మాటలకు దడ ఎత్తుకుంది. రచన అనుభవాల ముప్పుల్ని తెస్తుందనుకోలేదు. 'సరే' అన్నాను. పైగా దయానిధిని వినే అవకాశం. నాకు అంతవరకు పేరున్న రచయితతో నేరుగా పరిచయం లేదు.

బంజారాలోని దయానిధి ఇల్లు చూసి దిమ్మదిరిగిపోయాను. భూదేవి అయితే తప్పకుండా అని వుండేది. 'ఈ ఇంటికి అయిన ఖర్చుతో మా ఊళ్ళో మూడు నూర్ల ఎకరాలు కొనవచ్చు. కనీసం పది సంసారాలు బతుకుతాయి. ఎట్లాగో - కనీసం రెండు వేళ్లూ నోట్లోకి పోతూ?' అని. డ్రాయింగ్ రూం అద్భుతంగా వుంది. గ్లాసు బీరువాల్లో కవ్విస్తున్న ఇంగ్లీషు పుస్తకాలు. గదిలోని దయానిధి స్టడీ చెయిర్ ఒక ఇరవై వేలు కాదా? అనుకున్నాను. అందమైన జీవితం. చాలా ఆత్మీయమైన వాతావరణం. అంతకు ముందున్న బెరుకు పోయింది. మనసులో ఏదో విచికిత్స, మరేదో ద్వంద్వం. మరేవో మూలుగులు.

ఆషామాషీ పలకరింపులు అయ్యాక దయానిధి అన్నాడు. "మీ వ్యాసం

చదివినప్పటినుండి మిమ్మల్ని కలవాలని దాసుకు చెప్పాను. దాసు మీకు దగ్గరి మిత్రుడని ఆ పత్రికకు ఫోను చేసినప్పుడు తెలిసింది. దాసు పదేళ్ళుగా తెలుసు - నేను పనిచేసిన కార్పొరేట్ కంపెనీకి పనిచేసేవాడు. ఇప్పుడు మా కొత్త ఇండస్ట్రీకి కూడా. ముప్పయ్యేళ్ళుగా ఏమీ రాయని నన్ను గురించి ప్రస్తావించారు కదా? అది నాకు ఆశ్చర్యం కలిగించింది. ముఖ్యంగా మీరు రచనను అర్థం చేసుకున్న పద్ధతి. రచనతో మమేకం అయ్యే మీ అనుభూతులూ, వాటిని తెలిపే మీ సాహిత్య విశ్లేషణా, చాలా పరిణతంగా కన్పించాయి. మీది ఇంత చిన్న వయసు అనుకోలేదు".

నా వ్యాసం జీరాక్సు ప్రతిని వెతికి తెచ్చి ముందుంచుకొని, దయానిధి అన్న మాటలకు నాలోని పొగరుకు తృప్తి కలిగింది. నేనన్నాను:

"మీ నవల చదివినప్పుడు నాకు రెండురోజులు నిద్ర రాలేదు. మీరు మరొక్క నవల రాశారని తెలిసి దాన్ని సిటీ సెంట్రల్ లైబ్రరీలో గాలించి, దొరికించుకొని చదివాను. వాటి తర్వాత మీరు ఏమీ రాయలేదని తెలిసింది - మీ రెండు నవలల్లో ప్రపంచం ఒక రకంగా నాకు తెలిసిన ప్రపంచమే. మరొక రకంగా తెలియనిది. స్త్రీ, పురుష సంబంధాలను, ముఖ్యంగా నీతి సమస్యను మీరు చాలా సూక్ష్మంగా పరిశీలిస్తారు. మీ పాత్రలు, సన్నివేశాలు, ఘటనల వెనుక వుండే నేపథ్యం నాకు చాలా కొత్తది. ఆ మనుషులు మాత్రం నా చిన్నతనంలో నేను చూసినవాళ్ళలాంటి వాళ్ళే. మా బంధువుల్లోనే ఒకామె భూమి వుండే భర్తను వదలి దొంగసారా కాచే మనిషితో కాపురం చేసింది. తానూ దొంగసారా కాచింది. మనిషికి ఏది సుఖం అనే మీ అన్వేషణ నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తుంది...మిమ్మల్ని వినాలని వచ్చాను. నేనే ఎక్కువ వాగాను. క్షమించండి. రాయడం ఎందుకు మానుకున్నారు".

నా మాటలకు దయానిధి మందహాసం చేశాడు.

పైపు వెలిగించి దాసు గ్లాసులోకి మరికొంత విస్కీ వొంచి ఖాళీకాని నా గ్లాసువైపు చూసి తన విస్కీని కొన్ని సెకన్లు నాజూకుగా, నాగరకంగా తీసుకొని దయానిధి అన్నాడు.

"రాయటానికి ప్రేరణ అందామా? ఆత్మప్రేరణ అందామా? అంతశ్శక్తి అందామా? లిప్స అందామా? అంతర్వేదన అందామా? ఏదైనా అందాం. అది ఇప్పుడు మారింది. మనిషి తానుగా సాధించాలనుకునేదీ, ఇతరులకన్నా గొప్పగా - పోనీ వేరుగా - వుండాలనుకునేదీ, సంఘంలో ఒక ప్రత్యేక ప్రతిష్ఠనో, కీర్తినో పొందాలనుకునేదీ ఏదో ఒక సృజనశక్తి వుంటుంది. ఒకప్పుడు బాగా రాయాలనే దానిలో నాకు ఆనందం వుండేది. దాని స్థానంలో మరొకటి చోటు చేసుకున్నప్పుడు రాయటం ఎందుకు? చదవటంలో, ఇండస్ట్రీని స్థాపించి దాన్ని పెద్ద చెయ్యటంలో, దేశాలు తిరగటంలో ఇప్పుడు సృజనానందాన్ని పొందుతున్నా. నిజం చెప్పనా? ఆ రెండు నవలలూ రాయటానికి ముందు స్త్రీలలో ఆనందం కన్పించేది. అంటే సెక్సులో. డ్రింకులో, డబ్బు సంపాదనలో సుఖం లేదనుకోకూడదు. నా దృష్టిలో అలాంటి రసపారవశ్యమే సుఖం. అన్వేషణను బట్టి అది రూపం మార్చుకుంటుంది"

గోడలకు అమర్చిన వర్ణచిత్రాల వైపు చూస్తూ "నిజమేనేమో" అనుకున్నాను. దాసు అది గమనించి నాతో అన్నాడు. "అవన్నీ లక్షలు చేసే పెయింటింగ్స్ రా. దయానిధి లాంటి వాళ్ళు వుండబట్టే మాలాంటి వాళ్ళంతా బతకగలుగుతున్నాం".

దయానిధి అన్నాడు. "అది సరేలే దాసూ! మీ మిత్రుడితో మరొక అంశం చర్చించాలి..."

"అందంగా, నీ అంతశ్శక్తి ఎటుమళ్ళిస్తే అటు జీవించటమే ఒక గొప్ప కళ. ఆ

పెయింటింగ్స్ చూడండి మళ్ళీ. వాటిలో ఒక్క రంగులేదు. ఒకే ఒక్క-తత్త్వమూ లేదు. ఒక గొప్ప కూర్పు వుంది. సంగీతంలోలాగా. సంగీతంలో స్వరాలే రంగులు, తాళగతులు, రంగుల గమకాలు. అవునా?"

దయానిధి ప్రశ్నకు ఏం జవాబు చెప్పాలో నాకు తోచలేదు. సంకోచిస్తూనే అడిగాను.

"జీవితంలో ఈ మార్పులు - మీ జీవితంలో మాదిరివి - అసలు ఎందుకు వస్తున్నట్లు?"

దయానిధి పగలబడి నవ్వి, మరో విస్కీ తీసుకున్నాడు. "అది తెలుసుకొని ప్రయోజనం ఏమిటి?" అని అడిగాడు.

నాకు ఏ ప్రశ్నా, ఏ జవాబూ స్ఫురించలేదు. దాసు వైపు చూశాను.

వాడు ఇంకా ఎక్కువ తాగి, ఇంతవరకు ఏదో ఒక్కమాట మాత్రం అని, మౌనంగా వింటున్నవాడు, ఏ గొడవ చేస్తాడో అని భయంవేసి వెళ్ళటమే మంచిదనుకుంటున్నాను.

దయానిధి గమనించినట్లుంది. పనిమనిషితో భోజనం ఏర్పాటు చేశాడు. గొప్ప రుచి. తగు మాత్రం వైవిధ్యం. దయానిధి తానేమీ తినకుండా, మమ్మల్ని "అది తిను, ఇది తిను' ' అంటూ ప్రేమ చూపాడు. డిన్నరు పూర్తయింది.

అంతవరకూ మా పక్క సోఫాలో కూర్చున్న వాడల్లా లేచి దయానిధి తన స్టడీ చెయిర్లో కూర్చొని అన్నాడు.

"మీరు 'మార్పులు ఎందుకు వస్తున్నట్లు' అని ప్రశ్నించారు. 'అది తెలుసుకొని ప్రయోజనం ఏమిటి?"అని ప్రశ్నకు ప్రశ్న వేశాను. ప్రశ్నకు ప్రశ్న సమాధానం కాదు. అది మెదడును కదిలించే ఒక ఉపకరణం మాత్రమే. ఏ మార్పు అయినా నా దృష్టిలో అసంబద్ధమైనదే. అసంబద్ధమైన అస్థిత్వంలో జీవించటానికి అవసరమయ్యే మార్గం కూడా అసంబద్ధమైనదే. మరొక మారు చర్చిద్దాం లెండి" దయానిధి లేచి మర్యాదపూర్వకంగా భుజంమీద చేయి వేశాడు. "దాసు లేకుండా కలుద్దాం. ఈ మాట ఎంత చలించిందో మాటల్లో చెప్పలేను."

డ్రైవరును ఇచ్చి మా మా ఇళ్ళకు చేరవేయించే ఏర్పాటు చేశాడు.

రాత్రంతా నాకు నిద్ర పట్టలేదు. ఆయన జీవితం నాకు అందినంతగా, ఆయన వాదమో, తర్కమో అది నాకు అందలేదు.

ఊరి నుంచి ఉదయమే వచ్చిన భూదేవి నన్ను అడిగింది.

"కళ్ళు అంత ఎరుపుడాలుతో వున్నాయేం? దాసు ఇక్కడికి వచ్చాడా? ఎక్కడికైనా తీసుకువెళ్ళాడా? రాత్రి అంతా చదువుకుంటూ కూర్చుండి పోయావా?"

దయానిధి రాత్రి చర్చల గురించి, భూదేవితో చెప్పాను. ఆమె కాఫీ తాగుతూ వింది. మౌనంగా దినపత్రిక చేతికి తీసుకుంది.

"నువ్వు వెళ్ళినపని ఏమయింది?" అని అడిగాను.

"మనుషుల ఆలోచనల్నీ, ప్రేమల్నీ శాసించేది ఏమిటంటావు?"

భూదేవిలో ఏదో ఆవేశం కట్టలు తెంచుకోబోతోందని, జవాబు ఇవ్వకుండా ఊరుకున్నాను. భూదేవి ఏ ఆవేశానికీ లోను కాలేదు. శాంతంగా చెప్పుకపోయింది.

"మా అన్న చనిపోయి సంవత్సరం కాలేదు. డెబ్బయేండ్ల మా అమ్మ వుంది. మా వదినకు యాభై ఏండ్లు. పిల్లలు లేకపోవడం ఒక మేలైంది. అదే ఒక సమస్య కూడా అయింది. పదెకరాలూ, వుండే ఆ ఇల్లూ పంచుకుంటామంటూ మా అన్నలిద్దరూ ఎగబడ్డారు. అమ్మ

ఎవడో ఒకడి దగ్గర వుంటుందట! మా వదిన వాళ్ళ పుట్టింటికి పోవచ్చునంట! న్యాయం చూడు. మా అన్నలిద్దరికీ మర్యాదయిన ఉద్యోగాలున్నాయి. రెండో అన్న భార్యకు కూడా మంచి ఉద్యోగమే. మన పెళ్ళికి గొడవ చేసింది ఆ మహానుభావుడే. వాళ్ళు నా అన్నలనుకోవడానికి సిగ్గుగా వుంది. ఆశ. . .స్వార్థం. . ."

"మరి పంచాయతీ తెగలేదా?"

"మనం గట్టున నిలబడితే అట్లాంటి ఏ పంచాయతీ తెగదు. నేను చేసిన గొడవకు భయపడి ఒప్పుకున్నారు. ఆస్తిని అయిదభాగాలు చేయడానికి, మా అమ్మ పేరుతో రెండెకరాలూ, మా వదిన పేరుతో రెండెకరాలు రాయించినా. ఇల్లూ వాళ్ళకే. నా భాగానికి వచ్చిన రెండెకరాలూ మా అమ్మా, వదినా ఒద్దికగా వున్నంతకాలమూ అనుభవించవచ్చు. మా అమ్మ ఎవరిదగ్గరికి వెళ్ళినా, మా అమ్మ భాగాన్ని, నా భాగాన్ని కూడా మా వదినే అనుభవించవలసిందే. ఇట్లాంటి పరిష్కారాలతో బతుకులేవో బాగుపడిపోతాయని కాదు. వాళ్ళ తదనంతరం మాటేమిటి? అని మా రెండో అన్న. . .'వాళ్ళిష్టం' అని మొండికేశాను. ఇవి చాలామంది సమస్యలు. ఇవి తీరినవాళ్ళవి నువ్వు ముందు చెప్పావే దయానిధి అంతర్ఘోషలు. కొంతవరకు అప్పుడప్పుడూ నువ్వు చెప్పేవి కూడా. . .ఆ జీవుడు వేరు. . .ఈ జీవులు వేరు. సుఖం మరిగిన దాసప్ప పదం మరిచిపోయాడంటారు. అందుకేనేమో. . ."

నాలో లేని హాస్యం భూదేవిలో వుంది.

భూదేవి నాకు మరింత సన్నిహితంగా అర్థమవుతోంది.

తన సల్వార్ కమీజులను ఇస్త్రీ చేసుకుంటూ భూదేవి గుండెను తొలిచే రెండు మూడు మాటలు అంది.

"నా బాధ ఆస్తుల పంపకం కాదు. ఆడవాళ్ళను గాలికి వదిలేసే జీవితం ఎంత అమానుషం? అది అట్లా వుంచు. మా అమ్మా, మా వదినా ఆ కరువుల రాజ్యంలో ఆ ఫలసాయంతో ఎన్నాళ్ళు బతకగలరని? ఎట్లా బతకగలరనీ. మీ దయానిధి అనే ఏ అంతశ్శక్తో వుంటే తప్ప? ఎంత దుర్మార్గం?"

నా అశాంతి మూలాలు అక్కడెక్కడో వున్నట్లే వుంది. భూదేవి చెప్పిన వాళ్ళింటి సంగతులు మనసు పొరల్లోని చిన్ననాటి గాయాలను గుర్తుకు తెస్తున్నాయి. గుర్తుకు రానివీ - గుర్తుకు తెచ్చుకోడానికి ఇప్పటిదాకా ఇష్టపడనివీ. మెమెల్లగా నెమ్మదిగా. . . ○

● 16 ఫిబ్రవరి 1997 ఆంధ్రభూమి ఆదివారం ●